# తమ్ముడు

[ కథ ]

= శ్రీ కందుకూరు లింగరాజు =

"అమ్మ చచ్చిపోయింది..." అంతకంటె ఎక్కువ చెప్పలేని హృదయంతో రామూ వచ్చి, అప్పుడే వచ్చిన అన్నయ్యతో అన్నాడు.

పన్నెండేళ్లలోపు వున్న రామూను రుద్ధకంఠంతోటే, నీళ్లుతిరిగే కళ్లతోనే దగ్గరగాతీసుకుని హత్తుకొని వూరడించేడు. అంతకంటే ఏదో అని, ఏదో చెప్పి ఊరడిద్దామనుకున్న మాటలు, ఆ వయస్సుకు నచ్చచెప్పగల్గే, ధైర్యం, అనునయం కల్గించేవి కన్పించలేదు శీతారామయ్యకు.

అల్లా తమ్ముణ్ణి దగ్గరకు తీసుకుంటూనే కక్కాయిని చూచేడు. ఏదో తను కష్టపడి, సవతితల్లి పోయిందని ఏజెంటుకాళ్లూ కడుపూ పట్టుకుని, బ్రతిమాలి సంపాదించిన పదమూడురోజులూ రామూను తనదగ్గరే వుంచుకున్నాడు. తనతోటే అన్నం తినిపించేడు. తనప్రక్కనే పండుకోబెట్టుకున్నాడు.

శీతారామయ్యకు తెలుసు సవతితల్లి సావిత్రమ్మ తనను ఆఖరుకు గుమ్మంలోకైనా రానిచ్చేది కాదని. తన తల్లి పోయినతర్వాత తను ఆమెఇంట్లో గడిపిన, స్కూలుఫైనలు ప్యాసయ్యేవరకూ చవిచూచిన, ఆమె పెట్టిన కష్టాలు నెమరుకువస్తే మొదట్లో వెళ్లకూడదనుకున్నాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే తనను ఇంట్లోంచే తరిమేసిన సావిత్రమ్మకు, చచ్చి పదిరోజుల్లోనూ ఈ చంద్రలోకంలో తిరిగే ఆమెఆత్మకు తన చేత్తో పిండాలు వెయ్యటానికి మనస్సు ఒప్పిందికాదు. అయినా లోకానికి వెరచి,తప్పనిసరిగానే బయల్దేరేడు.

అసలు అప్పుడే సావిత్రమ్మ తనమీద కాస్తంత ఆఖరుకు నౌకరు రామయ్యకు ఇచ్చినంతైనా గౌరవం వుంచితే, తను చేసే నౌకరీకి ఫలంగా కాలేజీకి అయ్యే ఖర్చులన్నా ఇస్తుందని ఆశించేడు. కాని స్కూలు ఫైనలు ప్యాసవడంతోటే ఎల్లాగో తండ్రి సంపాదించి ఇచ్చిన ఉద్యోగంలో ప్రవేశించడం జరిగి, అందులోనే ఇంతకాలం బురదలో పడ్డ నత్తలా కొట్టుకుంటూనేవుండి, ఆశించుకున్న పెద్దవుద్యోగాలూ జీతాలూ, హోదాలకు తిలోదకాలు ఇచ్చుకున్నాడు. సావిత్రమ్మ మానసికంగా, భౌతికంగా,ఆఖరుకు ఆధ్యాత్మికంగా తనను ఎన్ని కష్టాలు పెట్టినా, అవన్నీ మరిచేపోయేడు బ్యాంకులో చేసే గొడ్డుపనితో. కాని ఇంటికి వచ్చే ప్రతీసాయింత్రమూ "ఆఖరుకు బి. ఏ. చదివేవరకన్నా వుంచింది కాదు...మహమ్మారి!" అనుకుని తిట్టని రోజు లేదు శీతారామయ్య జీవితంలో.

శీతారామయ్యకు రామూను చూడగానే తనకు సంతానం అంతవరకూ లేకపోబట్టి అనండి; లేకపోతే పుట్టకపోవడంవల్ల సహజంగా పిల్లలను చూడగానే ఉబుక్కువచ్చే వాత్సల్యంవల్లనే అనండి ...సావిత్రమ్మఅసలు ఆమెజీవితంలో తనను కష్టపెట్టిం

దనే అనుకోలేదు. అదంతా ఏ నవలలోనో చదివినట్టుగానే అనుకున్నాడు. ఆరోజుల్లో రామూను తన తల్లి కన్నట్టే భావించేడు. అతనిమట్టుకు ఎల్లావున్నా, పన్నెండు రోజులూ అయినతర్వాత తను చదువు చెప్పిస్తానని రామూను తీసుకువెళ్లే రోజున కక్కాయి "ఏదో నాయనా! పెద్దవాడి వయ్యేవు. మీనాన్నగారు చచ్చినరోజున వచ్చేవు. మళ్లీ ఇన్నాళ్లకు నాకడుపు చిచ్చుపెట్టి వెళ్లిన రోజున వచ్చేవు." అని ఏదో అనడంతో శీతారామయ్యకు గుండెల్లో గునపంగుచ్చినట్టే అయింది. "ఎల్లాగైనా కక్కాయి సావిత్రమ్మ తల్లేకాదూ!" అనుకున్నా బాధమాత్రం పోలేకపోయింది.

తన జీవితం సింహావలోకనం చేసుకుంటే కక్కాయి తనకు చేసిన ద్రోహం, చెయ్యదలచిన అపకారం ఇంతా అంతా కాదు. ఆఖరుకు కన్నతండ్రి చేతే "నాఆస్తంతా నాస్వార్జితం" అని అనిపించింది. తన తల్లివైపు పదివేలరూపాయల నగలూ, ఓరెండుపుట్లు వచ్చే మాగాణీ వుండవలసినా...ఇప్పుడు అవేమీ తనకు లేకపోయినా కక్కాయీ, సావిత్రమ్మా కలిసి తనకు పెట్టిన వాతలు, దెబ్బలుమాత్రం ప్రేమతో ఇచ్చిన ఆస్తిలా వుండిపోయేయి.

రామూ, తనూ ఇంటికి వచ్చేటప్పటికి, ఎన్నో విధాల ఆలోచనలు పోయేయి. ఒక్కటిమాత్రం హృదయంలోనుంచి ఎంత తోలుకుందా మనుకున్నా తోలుకోలేకపోయేడు. ఆఖరుకు కొన్నాళ్లపాటు తన తండ్రిచేతుల్లో ఎంతో గారాబం, ప్రేమ పొందిన మంచిరోజులు ఎదురుగాతిరుగుతే ఇప్పటికి ఆతండ్రి యొక్క రక్తాన్ని పంచుకుని మిగిలింది ముప్పైఅయిదు ఏళ్ల లోకాన్నిచూచి కొద్దోగొప్పో అనుభవం గణించిన తనూ, ఇకముందు ఏముందో తెలియని రామూనూ మిగిలేరా? నిజంగా దుఃఖమే వచ్చింది. తన తండ్రి సావిత్రమ్మచేతిలో ఎల్లా మారినా, ఇప్పుడు సమక్షంగా రక్తం ఇచ్చి పెంచిన రామూను తనకు అప్పచెప్పివెళ్లినట్టే తట్టింది.

గుమ్మంమెట్లు ఎక్కేటప్పటికి అంతవరకూ చూడని వెంకటలక్ష్మమ్మ 'అతడెవరు?' అన్నట్టు ఆశ్చర్యపడింది. ఓమాదిరిగా క్షణికం వూహతట్టినా, "వాణ్ణి ఎందుకు తీసుకువచ్చేరు? వాళ్ల కక్కాయి వుందిగా? బ్రతికున్నన్నాళ్లూ మనకు ఏమైనా పెట్టేరా? చచ్చికూడా మనమీద కక్షసాధిస్తారా?..." వగైరా ప్రశ్నలు వేసేంత తెలివితేటలూ, తంత్రాలూ లేకుండానే పెరిగిందవడంవల్ల స్వంతమరిది, తమ్ముడుగానే తీసుకుని తృప్తిపడింది. శీతారామయ్యకు ఎప్పుడూ భార్యను అనుమానించని హృదయం ఎంచేతో ఎక్కువగానే తేలికపడింది.

రామూ వచ్చినప్పటినుండి పంథాలన్నీ మార్చవలసివచ్చింది శీతారామయ్యకు. సావిత్రమ్మ రామూను ఎల్లా రాజఠీవిలో పెంచిందో? ఒకేరక్తంలోనుంచి పుట్టినా తను అనుభవించలేని దర్జాలూ, హోదాలూ అనుభవించేడని తెలుసు. అదికూడా అంత చిన్నవయస్సులోనే. ఒక్కసారిగా తను గడిపే క్లుప్తసంసారం... ఏదో పచ్చడిమెతుకులు...కాసిన్ని చింతపండునీళ్లు... ఇన్ని నిమ్మకాయిపిండిన మజ్జిగనీళ్లతోటి రామూ అలవాటుపడాలంటే కష్టమే! అంచేత తను అనుకున్నట్లు, తనూ వెంకటలక్ష్మీ వూహించుకుని, ప్రతి నెలా దాచుకునే పదో, పదిహేనురూపాయలు ఇక మిగల్చడం కష్టం అయినా, దాన్ని తమ్ముడికోసం త్యాగంచెయ్యడానికి నిశ్చయం చేసుకున్నాడు. తను తన జీవితంలో పొందలేని, తన ఆశలన్నీ ఫలాలు అవలేని సన్నివేశాలు రామూజీవితంలో వుండకూడదు. తల్లీ, తండ్రీ లేని పిల్లాడి మనస్సు ఏ విధంగానూ కష్టపడకూడదు అన్న భావంలో పడ్డాడు.

దాంతో సావిత్రమ్మగారి ఇంట్లోలాగే ప్రొద్దుటే కాఫీ, శుభ్రంగా పప్పూ, రెండుకూరలతోటి భోజనం, సాయింత్రం 'టీ' వగైరాలన్నీ నెమ్మదిగానే శీతారామయ్యఇంట్లో ప్రవేశించేయి. వెంకటలక్ష్మమ్మకు "తప్పిదారి తనకే ఓ బిడ్డ పుడితే వాడి

కోపమని నిల్వచేసిన రెండు వేలలోంచీ ఇంటిఖర్చుకు నెల నెలా తీస్తున్నారే" అని కాస్తంత హృదయానికి తట్టినా ఏదోలే అన్నట్టుగానే ఊరుకుంది.

ఆ రెండేళ్లలోనూ ఎన్నో మార్పులు వస్తూనే వున్నై. చదువుకోడానికి శుభ్రమైన గది లేదని ఇంకో పెద్దఇంట్లోకి వెళ్లేరు. కాస్త మధ్యాహ్నం స్కూలుకు టిఫిన్ తీసుకువెడతాడని ఓ కుర్రాణ్ని కూడా పెట్టేరు.

ఖర్చు ప్రతినెలా ఎక్కువే అవుతున్నా తమ్ముడు సుఖంగా, దర్జాగా రాజఠీవి పొందుతున్నా డన్న సంతోషం...తనకంటె ఎక్కువ హోదాలో తన తల్లి చూపించలేని దయ తను భిక్షగా ఇస్తున్నా డన్న గొప్ప...తనకు ఇక పిల్లాగానూ బిడ్డలు కల్గరు, వీడినేకొడుక్కింద పెంచుకుంటానన్న వాత్సల్యం... తర్వాత తర్వాత పెద్దపెద్ద చదువులు చదివి పెద్ధ పెద్ధ ఉద్యోగాలు చేస్తూ తనను సుఖపెడతాడన్న ఆశతోనే శీతారామయ్య తృప్తిపడ్డాడు.

ఆ యేడు స్కూలుఫైనలు గట్టెక్కడంతోనే రామూ పడిన సంతోషంకంటే శీతారామయ్యే ఎక్కువ సంతోషించేడు. వెంకటలక్ష్మమ్మ మురిసే పోయింది.

రామూకూడా అన్నగారింటికి వచ్చినప్పటి నుంచి తను అసలు తల్లినీ, తండ్రినీ కూడా పోగొట్టుకున్నానన్న తలంపే కలగకపోవడంవల్లా, తను రోజూ అనుభవించే రాజభోగాలవల్లా శీతారామయ్య, వెంకటలక్ష్మమ్మలే తనకు దేవుడిచ్చిన తల్లీ, తండ్రీ అని సంతృప్తిపడ్డాడు. తెలియని మొదటిరోజుల్లో 'అమ్మా' అనే పిల్చి తృప్తిపడ్డాడుకూడాను. అల్లా పిల్చినప్పుడు వెంకటలక్ష్మమ్మకూ పాలుచేపొచ్చినట్టే అయి రామూను కౌగలించుకునేది. తన కొడుకు, తన తమ్ముడు, తన మరిది అన్నీ కల్పిన ప్రేమతో, వాత్సల్యముతో పెంచింది.

అసలు వెంకటలక్ష్మమ్మకు ఒక్క అక్కగారు తప్ప ఇంకెవ్వరూ లేనేలేరు. చాలాకాలం ఓ తమ్ముడైనా ఉంటే బావుండేదనుకుని ఎన్ని దేవుళ్లకు మ్రొక్కినా వారు వరమియ్యనేలేదు. ఏదో రామూను చూచేటప్పటికి దేవుడీ విధంగానైనా చూచి సంతోషించమన్నాడని తృప్తిపడింది. దాంతోనే రామూ యెడ గౌరవంకూడా హెచ్చయిపోయింది.

ఆ వర్షాకాలంలో రామూకు జ్వరం వచ్చింది. శీతారామయ్యకు గుండె గుభేలుమన్నట్టే అయింది. ఆఫీసుకు సెలవుపెట్టి రామూమంచందగ్గరే, అన్నం కూడా తినకుండా గడిపేడు. కళ్లమ్మట నీళ్లుకూడా కుక్కుకొన్నాడు. ఎవరు ఏది చెపితే ఆవైద్యం, ఆ చికిత్స చేయించేడు. ఆఖరుకు రక్షరేకుకూడా కట్టించేడు. అతని మాట ఎల్లా ఉన్నా వెంకటలక్ష్మమ్మకు ప్రాణాలు పైనే పోయేయి. ఊళ్లో ఉన్న పోలాలమ్మకు చలిమిడిపానకాలు మొక్కుకుంది. సత్యన్నారాయణవ్రతం చేయిస్తానంది కూడా.

ఇంతకూ ఆజ్వరం కాస్త కాలంమార్పువల్ల వేసవిలోంచి వర్షాల్లోకి దింపేటప్పటికి వచ్చింది. మూడురోజుల పట్టపగ లుండి పారిపోయింది. అతని జ్వరం మాట ఎల్లా వున్నా, పదిలంఖణాలు చేసినట్టు శీతారామయ్యా, వెంకటలక్ష్మమ్మా తయారయ్యేరు.

అసలు రామూ ఏ ముహూర్తాన, ఏ ఘంటలో, ఏ నిముషంలో శీతారామయ్యఇంట్లో అడుగుపెట్టేడోకాని, ఆక్షణాన్నుంచి కొన్నాళ్లు తెలియకుండా, కొన్నాళ్లు తెలిసీ తెలియకుండా, మరికొన్నాళ్లు తెలిసే, వెంకటలక్ష్మమ్మహృదయంలో రామూకు తన అక్కకూతుర్నిచ్చి పెళ్లిచేస్తే బావుంటుం దన్న భావం మొలిచింది, పెరిగింది, అల్లుకుంది. ఈ భావం రోజురోజుకూ రామూను పెరిగే స్థితిలో చూస్తుంటే (ఆ పచ్చటి పసిడిశరీరం, పైకి దువ్విన క్రాపింగు, జబ్బకట్టిన చెయ్యి, వచ్చీరాని మీసాలు) ఎక్కువే అయి శరీరాన్ని అంతా వుములుకుంది. ఆఖరుకు కొన్నాళ్లు అతన్ని చూచినప్పుడల్లా అతడు 'తన అల్లుడే' అనుకుని మురిసిపోయింది.

ఈ భావం, ఈ ఆలోచనా వెంకటలక్ష్మమ్మ చాలాకాలం శీతారామయ్యతో చెప్పకుండానే దాచి

పెట్టింది. "అప్పుడే, ఇంకా మీసకట్టైనా రాలేదు, పెళ్లా" అనేస్తారని భయపడింది. ఆఖరుకు రామూ స్కూల్ ఫైనల్ ప్యాసయింతర్వాత, ఇక ఉండబట్టలేక, రాత్రి ఏదో ఏదో చెప్పుకున్న తర్వాత గునుస్తూ, మురుస్తూ, సగం సిగ్గుతోనే చెప్పింది.

శీతారామయ్యకుకూడా వెంకటలక్ష్మమ్మ చెప్పినదాంట్లో ముజ్జిడ్డుతనం ఏమీ కన్పించలేదు. అంతా సమంజసంగా, సబబుగా, బావున్నట్టే తట్టింది. ఇదివరకు ఆతలంపే అతనికి తట్టలేదు. ఇక రామూ తనవాడు అవుతాడనీ, తనకు గౌరవం, ప్రతిష్ఠా ఆర్జించిపెడతాడనీ, అన్నిటికంటె, ఆఖరుకు, ఓ వరసగా 'అల్లుడు' అవుతాడనీ సంతోషపడ్డాడు. 'అల్లుడు' అనుకున్నప్పుడు యెందుకో శీతారామయ్యశరీరం పులకరించింది. ఓసారి అసబబుగా అన్నట్టు ఎడంకన్ను అదిరింది. ఏది ఎల్లా ఉన్నా "భేషుగ్గా ఉంది నీ ఉద్దేశ్యం" అన్నట్టు వెంకటలక్ష్మమ్మను మెచ్చుకున్నాడు. ఆయనా మెచ్చుకునేటప్పటికి వెంకటలక్ష్మమ్మ నెమిలే అయిపోయి సిగ్గుపడింది. సంతోషించింది.

అయితే తీరా ఈవిషయం ఎవరిదగ్గర ప్రస్తావన తెద్దామా అన్నది ఇద్దరికీ సమస్యఅయి ఆరాత్రంతా ఎవరి దారిలో వారు ఆలోచించడానికి మొదలెట్టేరు.

*       *       *

రామూకు కాస్త జ్ఞానం వచ్చినప్పటినుండీ కక్కాయి అన్నయ్యకు ఆఖరుకు వారానికి ఒక్కమాటైనా 'తననుపంపివెయ్యమని' ఉత్తరం వ్రాస్తాందని తెలుసు. అన్నయ్యకూడా ఉత్తరం వచ్చినప్పుడల్లా "ఒరేయి, ఇవ్వాళ కక్కాయి నిన్ను రమ్మందిరా"అని ఏ భోజనం చేసేటప్పుడో చెప్పేవాడు.

అసలు శీతారామయ్యకూ ఇష్టంలేదు రామూను కక్కాయియింటికి పంపాలని. ఆ మహమ్మారి రామూను ఏం మార్చేస్తుందో అన్న భయం లోలోపల పీకడం, పైగా ఇన్నాళ్లూ పెంచిన, ఆదరించిన ప్రేమా, భావిలో కట్టుకున్న, పెట్టుకున్న ఆశా సౌధాలూ పటాపంచలుచేస్తుందేమో అన్న బితుకూ వుండడంవల్ల రామూను "పోనీ, వెళ్లిరా, ఓవారం రోజు లుండిరా" అన్న ముక్క అందామనుకున్నా అననివ్వలేకపోయింది. వెంకటలక్ష్మమ్మా, కక్కాయివిషయంలో స్వానుభవ మేమీ లేకపోయినా, భర్త చెప్పిన మాటలూ, సన్నివేశాల బట్టి ఊహించుకుని, రామూను"వెళ్లిరా నాయనా"అనలేక ఊరుకుంది.

వాళ్లమాట ఎల్లావున్నా రామూకే కక్కాయియింటికి వెళ్లడానికి ఇష్టంలేదు. ఈఇల్లు, అన్నయ్య, వదిన అంతా అలవాటైపోవడంవల్లో, లేకపోతే ఆ పల్లెటూరు వెళ్లడానికి ఇష్టం లేకపోవడంవల్లో రామూ వెళ్దామనుకున్నా వెళ్లడానికి మనస్సు ఒప్పుకోలేదు.

వేసవిశెలవుల్లో కక్కాయి ఇక బ్రతుకుతుందో బ్రతకదో అన్న వుత్తరం కరణంగారు రాయడంతో శీతారామయ్య ఖంగారుపడ్డాడు. తీరా రామూను పంపకపోతే, అందులో పల్లెటూరుకూడా, తలో మాటా అంటారని భయపడ్డాడు. "చూచేరా, తమ్ముణ్ణి మంచివాణ్ణి చేసుకుని ఆస్తంతా కాజేద్దామని చూస్తున్నాడు. ముసల్ది చస్తున్నా మనవణ్ణి పంపలేదు"అని అపవాదు తనమీద పడేస్తారేమో అని ఒణికేడు. ఆ శనివారంమధ్యాహ్నం ఆఫీసుపని ఒంటిఘంటకే ఈడుతూమడుతూ పూర్తిచేసుకుని, రామూతో వాళ్ల కక్కాయివూరు వెళ్లేడు.

అంతదూరంలో ఎక్కడ చూచిందో, లేక ఎవరైనా ముందరనే ఈవార్తచేరవేసేరో తెలియదుకాని గుమ్మంమెట్లు ఎక్కేటప్పటికి కుక్కినులకమంచంమీంచే బావురుమంది.

"ఎన్నాళ్లకు కళ్లపడ్డావురా రామయ్యా. ముసల్ది చచ్చిపోలేదు. ఇల్లా పీక్కుతింటున్నాది వ్యాధి. నా కూతురు సావిత్రమ్మ బ్రతికుంటే నువ్వు దూరమయ్యేవాడివా? ఎంత రక్తం పంచుకున్నా, ముసలిపీనుగమీద కాస్తంత ప్రేమా చూపించలేకపోయేవా నాయనా..." ఈ వరసలో ఏడుస్తూనే రామూను కౌగిలించుకుంది. ఒళ్లంతా నిమిరింది.

“అయ్యో! అయ్యో! ఎంత చిక్కిపోయేవు... ఆ వూరినీళ్లు పడలేదు కాబోలు. ఇక్కడున్నప్పుడు పనసపండులా వుండేవాడవు” అంది.

అంతవరకూ శీతారామయ్యను “మంచినీళ్లు కావాలా? కూర్చో” అనేనా అనలేదు. అతని వేపే చూడలేదు. పైగా రామూ చిక్కిపోయాట్ట. మరి తను సేవింగ్సుబ్యాంకులోంచి నెలనెలా తీసి రామూ కోసం వెచ్చించిన పదిహేనువందలూ మట్టిలో పోసినట్టేనా? రామూకడుపు కాల్చి తనూ, తన పెళ్లాం అందలం ఎక్కి వూరేగుతున్నారన్నట్టేగా కక్కాయిభావం. గుండెలు నలిమివేసినట్టే అయింది.

అరఘంట అయిన తర్వాత కాస్త కళ్లకు చెయ్యడ్డుపెట్టుకుని “నువ్వా...శీతన్నా...వచ్చేవా? ఏదో బ్రతికున్నన్నాళ్లూ చూడ్డానికి రాకపోయినా, చచ్చేటప్పుడైనా వచ్చేవు...నీ దయ...” ఆ ముక్కల్లో పాపిష్ఠి అన్నది చూపించేసింది. “కూర్చో. మంచి నీళ్లు కావాలా నాయనా?” అంది.

ఆ మాటలు శీతారామయ్యను నుంచున్నపళంగా రక్తంతో జేసినట్టే అయింది. సమాధాన మివ్వలేకపోయేడు. అల్లాగే చచ్చిపోయి ‘ఎందుకు వచ్చేనా’ అని తలవంచుకూర్చున్నాడు. కక్కాయి అన్నయ్యను ఆ విధంగా ఆడిపొయ్యడం రామూకు కష్ట మనిపించింది. కక్కాయిని అడిగేద్దా మనుకున్నాడు. కాని ధైర్యం చాలకపోయింది. లోలోపల బాధపడుతూనే అన్నయ్య అక్కడ, తన కున్న స్వేచ్ఛలో, సాధ్యమైనంతవరకూ సేవచేసేడు. కాని కక్కాయికి రామూ శీతన్నను అంత పూసుకుతిరగడం చాపక్రింద పల్లేరుకాయలు పోసినట్టే అయింది.

సమయం దొరికినప్పుడల్లా శీతన్నను దెప్పిపొడవడంతో సరిపెట్టింది కక్కాయి. రామూకు చాలా సార్లు నొప్పికల్గించింది. తన తల్లి బ్రతికున్నప్పుడు కక్కాయీ, తల్లీ కలిసి శీతన్నను పులిస్త్రాకుకంటె నీచంగా చూస్తూ కబుర్లుచెప్పడం ఒకటిరెండుసార్లు విన్నాడు. ఆస్తినిగురించి అప్పుడు ఏదో గుసగుసలు ఆడేరుకాని అర్థంకాని స్థితిలో ఉండిపోయింది. మరి ఇప్పుడు దాన్ని గురించి ఎంత ఆలోచించినా తెగా తెంపూ లేక జ్ఞాపకంరాని సంగతిలాగే వుంది.

సాయంత్రమే శీతారామయ్య వెళ్లిపోతానన్నాడు. కాని రామూకు వదిలిపెట్టాలనిలేదు. ఇటు కక్కాయికి ఎదురు తిరిగి వెళ్తానని చెప్పడానికి గుండెలు అతుక్కొనూ లేకపోయేయి. కనీసం ఆరాత్రికి అయినా ఉండిపొమ్మని పట్టు బట్టేడు. అంచేత నిలబడలేని మాటలు ఇంకా ఏమి వినవలసివస్తుందో అన్న బితుకుహృదయంతోటే ఆగేడు.

ఆరాత్రి కక్కాయి శీతన్నను చాలా నీచంగానే చూచింది. రామూహృదయం చాలా బాధపడింది. ఆఖరుకు గుడ్లమ్మట నీళ్లుకూడా కుక్కుకున్నాడు. తనకు అన్నమే కడుపునిండా పెట్టడం లేదట; కట్టుకోడానికి గోనుసంచుల్లాంటి బట్టలు కుట్టించేట్ట; ఒక్కరోజునైనా బండిమీద స్కూల్‌కు పంపలేదట; సంవత్సరానికి ఒక్కపండుక్కైనా తలంటినీళ్లు పోయలేదట-ఆవరసలో కక్కాయి అన్నగారిని దెప్పింది. చీకటితోనే, రామూ లేవకుండానే, గుండె పగిలిపోయే సన్నివేశాలు ఇంకా ఏం సిద్ధిస్తాయో అని భయంతో చెప్పకుండానే వెళ్లిపోయేడు శీతన్న. శీతన్న చెప్పకుండా వెళ్లడం కక్కాయికి మరోసమిధ దొరికినట్టే అయింది. “చూచేవురా, రామన్నా. వాడికి నన్ను చూడ్డానికి మొఖం ఎట్లా చెల్లుతుందిరా? వాళ్ల నాన్న బ్రతికివున్నన్నాళ్లూ ఆయన్ని కాల్చుకు తిన్నాడురా! ఆయనకు తిన్నతిండి వంటబట్టిందిరా! మీ అమ్మకు నేపెట్టిన కాసులపేరు, వడ్డాణం వాళ్ళ అమ్మవనీ, ఆస్తిలో సగం తనదేననీ దావా వేసేడురా. మీ అమ్మపేర కొన్న ఇల్లు తనదే అన్నాడు. ఇదంతా ఆముండ వుందిగా...వెంకటలక్ష్మమ్మ... అది చేయించిందిరా! మేం ఉన్నన్నాళ్లూ ఇన్ని చారునీళ్లూ, మజ్జిగనీళ్లతోటి వాణ్ణి ఒంగతీసేంకాని లేకపోతే పట్టుపగ్గాలు వుండేవా? బి. ఏ. చదువుతానని ఎంత పేచీపెట్టేడు...వాడి మొఖానికి పెద్ద చదువుకూడాను......” ఈ వరసలో చాలా నూరింది రామూ చెవులో.

అప్పుడే కన్ను తెరుస్తున్న జ్ఞానంలో రామూ ఆలోచించేడు. కక్కాయి అంత అబద్ధాలు ఆడుతుందా? శీతారామయ్య అంత దుర్మార్గుడా? తన తల్లినీ, తండ్రినీ అంత కాల్చుకుతిన్నాడా?...ఇవో ప్రక్క, తనకు జ్ఞానం వచ్చినప్పటినుండి వెంకటలక్ష్మమ్మశీతారామయ్యల ఆదరణ, ప్రేమ, ఆపేక్ష ఇవి మరో ప్రక్క నిల్చుని జడ్జీక్రింద చేసేయి. ఎటూ నిర్ణయానికి రాలేక బాధపడ్డాడు. కక్కాయి ఓ ప్రక్క, శీతారామయ్య అన్నయ్య ఓపక్క—తాను మధ్య అడకత్తిరిలో వక్కలా నలిగేడు.

"నిన్ను ఇప్పుడు మంచితనం ఎందుకు చేసుకుంటున్నాడో తెలుసా? ఇప్పుడు నీకున్న ఆస్తిలో భాగం ఎల్లాగైనా సంపాదిద్దామనీ...తన తల్లివి పదివేలరూపాయలబంగారం మనింట్లో ఉందని అది ఎల్లాగైనా స్వాధీనంచేసుకుందామనీ. ఒరే వెర్రి బాగులువాడా? వాడు రెండుసార్లు టిఫిన్ కాఫీలు పోయించేడంటే, ఊరికే అనుకున్నావా? సినీమాకు తీసుకెళ్లేడంటే...ఏముందిరా, ముందుముందు నీకంతానికి ఉరిపొయ్యడానికేరా? నేనున్నానని ఇంకా హడలిచస్తున్నాడుకాని... చూడు, ప్రొద్దున్న చెప్పకుండా ఎల్లా తోకముడిచేడో! లేకపోతే, వెర్రికుంకాయి, నీచేత ఈపాటికి వేలుముద్రవేయించేసేవాడే కాదురా! నీతల్లి చచ్చిపోయిందికాని లేకపోతే నీబ్రతుకంతా ఇల్లా అడవిలో ఉన్నట్టు అయ్యేదిరా? అందుకనేరా వారంవారం నీకోసం ఉత్తరం రాయించేదాన్ని రమ్మని...... నాయనా, ఈముసలిదాన్ని నమ్మేవా?"అని ఏడ్చింది. చాలాచక్కగానే అభినయించింది.

శీతారామయ్య అనే భగవద్గీతకు ఇప్పుడు కక్కాయి టీకాతాత్పర్యం చెపుతోందా? ఇంతకాలం ఓవిషప్పుచ్చి ఇంటిక్రింద తాను అజ్ఞాతవాసం చేస్తున్నాడా?

"ఏరోజునైనా ఆ వెంకటలక్ష్మి నీకు మందు పెట్టేస్తుందేమోఅని ఎంత ఏడుస్తున్నా ననుకున్నావ్? ఆముండ మహామ్మారిరా? పయోముఖవిషకుంభం"

తక్కిన, తర్వాత గడిచిన మూడురోజుల్లోనూ దాన్నిగురించే ఆలోచించేడు...అటు ఆరేళ్లనుంచీ ఏర్పడ్డ ప్రేమ, వాత్సల్యం, చనువు-ఇవన్నీ ఎదురుతిరిగేయి. కక్కాయి తనను ఆమెవేపు తిప్పుకోవాలని వేసే ఎత్తులేమో అనుకున్నాడు. అన్నయ్య అంత పని చేస్తాడా అన్న నమ్మకం కల్గలేదు. అదంతా అబద్ధంక్రింద కనిపించింది. ఇంక అందులోనూ వెంకటలక్ష్మమ్మ మందుపెట్టేంత మహామ్మారా? ఈప్రశ్న మరింత ముజ్జిడ్డుగా కన్పించింది.

రెండురోజులు పోయినతర్వాత కక్కాయి సత్యనారాయణవ్రతం చేయించింది. అన్నారం కొండకు వెళతాననికూడా మ్రొక్కుకుందిట. 'ఎందుకు?' అంటే "నువ్వు సరిగ్గా వాళ్లింటిదగ్గరనుంచి తిరిగివస్తావో, లేదో అన్న భయంచేతనే" అంది.

మరి జ్వరం వచ్చినపుడు ఇద్దరూ సగం చిక్కేరే...ఈఅంశం ఏవిధంగా కక్కాయిమాటలకు అతకడం?

శెలవులన్నీ నెమ్మదిగా అయిపోయేయి. రెండు మూడుసార్లు అన్నయ్యదగ్గరకి వెళతానని నోటి చివరవరకూ వచ్చింది. ఓసారి నోరుజారింది. అవ్వాళెల్లా అన్నయ్యను చంపేట్టు మాట్లాడింది. దావావిషయం, ఓరోజున అన్నయ్య మహా బాధ భరించలేనట్టు విషం కూడా తెచ్చేడట. "ఆవెధవ ఆ దారుణప్పని చేసేడా నేను, మాఅమ్మ, అయ్యకూడా కటకటాల వెనకాల ఉండిపోవలసివచ్చేది!"అని ఏమిటేమిటో చాలా చెప్పింది.

తను ఓనెల్లాళ్ళనుంచి కక్కాయి చెప్పేమాటలు వినడంవల్లనో, లేక అన్నయ్యకు దూరంగా ఉండడంమూలానో కాని యాదవకులంలో ముసలం పుట్టినట్టే అయింది. అన్నయ్యమీద ఎంత తెచ్చుకోకూడదనుకొన్నా ఓవిధమైన ఈర్ష్య, కోపం, పగా కల్గిపోయేయి. కక్కాయి అంత వృద్ధవయస్సులో వున్నా తనకోసం త్యాగం చేసినందుకు ప్రేమా, కృతజ్ఞతా కల్గినయి.

ఆ శలవులాఖర్నే "వాళ్ల ఇంటిదగ్గరుండి చదువుకోవడం నాకు ఇష్టం లేదు. ఇక్కడ నాకు కంటిమీద కునుకైనా పట్టదు. అక్కడుంటే నీకు దినదినగండం. అన్నట్టు...కావలిస్తే నేనే వస్తా; కాకినాడలో కాపురంపెడదాము. నువ్వుకాక నాకెవ్వరున్నారు ప్రపంచకంలో" అంది కక్కాయి. కళ్లమ్మట ఓసారి అమ్మను తలచుకుని నీరెట్టింది కూడాను.

ఎటూ చెప్పలేక కొంతసేపు తికమకలాడి "సరే. సామాను తెచ్చుకుని వస్తా" అని అన్నయ్యగారింటికి బయల్దేరేడు. (సశేషం)